



కడియం సత్యదేవ నర్సరీలో సంక్రాంతి సందర్భంగా పూల అలంకరణ

జోరుగా కోడి పందేలు, జూదాలు

- అన్ని చోట్లా అధికార పక్షం జోక్యం
- నేతల పర్యవేక్షణలో చేతులు మారుతున్న రూ. కోట్లు
- కోర్టు ఆదేశాలు బేఖాతరు

సంక్రాంతికి రాజకీయ సెగ తగిలింది. ఎన్నికల కోలాహలం కోడి పందాలను తాకింది. అతి దగ్గర్లో ఉన్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అధికారపక్షం పందేలకు అండగా నిలిచి 'బరి' తెగించింది. అన్ని చోట్ల అధికార పార్టీ నేతలే స్వయంగా రంగంలోకి దిగారు. ఎంఎల్‌ఎల బంధువులు, జిల్లా, మండల స్థాయి నేతలు పందాలను పర్యవేక్షించారు. మూడు రోజులపాటు కత్తులు కట్టిన కోళ్ళతో కోడిపందాలు, గుండాట, కోత ఆట తదితర అన్ని రకాల జూదాలకు తెరలేపారు. న్యాయస్థానం ఉత్తర్వులతో పోలీసులు ఎంతగా హెచ్చరించినా రాజకీయ ప్రోద్బలంతో చేతులెత్తేసే పరిస్థితి ఏర్పడింది. ఆర్భాటపు ప్రకటనలు, ఆడంబర ప్రచారాలు సాగించినప్పటికీ ఆఖరి నిమిషంలో పోలీసులు ప్రేక్షకపాత్ర వహించక తప్పలేదు.

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి, యంత్రాంగం

జిల్లా ఎస్‌పి కార్యాలయానికి కూత వేట దూరంలో నగరంలోని గొడారగుంట, గైగోలుపాడు, కాకినాడ రూరల్ మండలంలోని తూరంగి, సర్పవరం, తిమ్మాపురం, రమణయ్యపేట, వలసపాకల, పండూరు, చీడిగ, కొవ్వూరు, వాకలపూడి, కరప మండలంలోని గురజానపల్లి, గొర్రిపూడి, పిఠాపురం పట్టణంలోని వైఎస్‌ఆర్ గార్డెన్, రూరల్ మండలంలోని ఎఫ్‌కె. పాలెం, విరవ, విరవాడ, కోలంక, గోకివాడ, సామర్లకోట మండలం చంద్రంపాలెం, వేట్లపాలెం, కిర్లంపూడి, జగ్గంపేట, కోటనందూరు, రౌతులపూడి, తుని, తొండంగి, గొల్లప్రోలు, యూ. కొత్తపల్లి తదితర మండలాల్లో పలు గ్రామాల్లో కోడిపందాలు యథేచ్ఛగా ప్రారంభమయ్యాయి. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని కాట్రేనికోన గెద్దనపల్లిలో భారీగా కోడిపందేల బరి ఏర్పాటు చేశారు. టెంట్లు ఇతర హంగామా మొదలైంది. మలికిపురం మండలం లక్కవరం, మలికిపురం, గుడిమెల్లంక, మేడిచెర్లపాలెం, కత్తిమండ, బట్టేలంక, కేశనపల్లి, తూర్పుపాలెం, సఖినేటిపల్లి మండలంలోని సఖినేటిపల్లి లంక, అంతర్వేది దేవస్థానం, పల్లెపాలెం, టేకిశెట్టిపాలెం మామిడికుదురు మండలంలోని గోగన్నమఠం, మగటపల్లి, రాజోలు, కాట్రేనిపాడు, శివకోడు, అల్లవరం మండలంలోని కోడూరుపాడు, ఎంట్రుకోన, అల్లవరం, ఐ. పోలవరం మండలంలోని కేశనకుర్రు, కోమరగిరి, పోలవరం తదితర ప్రాంతాల్లో కోడిపందాలు సాగుతున్నాయి. తూర్పుగోదావరి జిల్లాలో సైతం పలు ప్రాంతాల్లో జూదాలు ప్రారంభమయ్యాయి. సోమ, మంగళవారాల్లో కూడా యథేచ్ఛగా జరగనున్నాయి. కోర్టుల ఆంక్షలు, పోలీసుల ఆదేశాలన్నీ బేఖాతర య్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 250 బరుల్లో పగలు, రాత్రి తేడా లేకుండా పందాలు, జూదం నిర్వహిస్తున్నారు. రాబోవు ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అధికార పార్టీ పెద్దలు కోడి పందాల నిర్వహణ పట్ల మౌనం వహించాలంటూ పోలీసులను కట్టడి చేసినట్లు తెలిసింది.



కాకినాడ వలసపాకల వద్ద బహిరంగ ప్రదేశంలో పందేల శిబిరాలు(ఇన్‌సెట్లో కత్తులు దూస్తున్న కోళ్లు)

తొలి రోజు రూ.100 కోట్లు పైనే

మూడు జిల్లాల్లో మధ్యాహ్నం తర్వాత పందేలు, జూదాలు జోరందుకున్నాయి. మొదటి రోజు సుమారు రూ.100 కోట్లు చేతులు మారినట్లు అంచనా. తొలిరోజే ఈ స్థాయిలో ఉంటే మిగిలిన రెండు రోజులు తారా స్థాయికి చేరే అవకాశం ఉందని అంచనాలు వేస్తున్నారు. బరులు నిర్వహణ పేరుతో అధికార పార్టీ నేతలు భారీగా ముడుపులు దక్కించుకున్నారన్న ప్రచా రం జరుగుతోంది. గుండాట నిర్వహణకు వేసిన వేలం పాటల్లో అధిక మొత్తాలను ఆ పార్టీ నేతలు ఖాతాల్లోకి తరలించినట్లు తెలిసింది. ఒకవైపు పందెం నిర్వాహకులను సంతోషపరచడం, మరో వైపు తమ పార్టీ నేతలకు ఆర్థిక ప్రయోజనం నెరవేరుతుండడంతో అధికార పార్టీ పెద్దలు అన్ని రకాలుగా అవకాశాలు కల్పించినట్లు సమాచారం. అయితే కోడి పందాల జోరు మాత్రం పలువురు సామాన్యుల జేబులను ఖాళీ చేస్తుంది. జూదాల కారణంగా పండుగ సంతోషాన్ని కూడా దూరం చేస్తున్నట్లు కన్పిం చింది. యువత, మహిళల్ని కూడా పందేలు, జూదాలకు దగ్గర చేస్తుండడం ఆందోళనకరంగా కనిపిస్తుంది.

కొసమెరుపు

ఆదివారం ఉదయం నుంచి యథేచ్ఛగా కోడిపందేలు, గుండాట, ఇతర జూద క్రీడలు జరిగాయి. అయితే సాయంత్రం తర్వాత పోలీసుల హడావుడి కనిపించింది. కాకినాడ రూరల్ వలసపాకలలో నిర్వహిస్తున్న కోడిపందాలు, గుండాటలను తన సిబ్బందితో కాకినాడ డిఎస్‌పి మురళీకృష్ణారెడ్డి అడ్డుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న కొంతమందిని అదుపులోకి తీసుకుని సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు ఆంక్షలు లెక్క చేయకుండా కోడి పందాలు, గుండాటలు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పి ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.



సర్పవరంలో గుండాట నిర్వాహణ



చిత్రాడ గ్రామంలో గుండాట బోర్డును తొలగిస్తున్న పోలీసులు



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు శేషబాబ్జి, బేబీరాణి, ఇతరులు

సిఐటియు క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కాకినాడ

సిఐటియు 2024 క్యాలెండర్‌ను జిల్లా అధ్యక్షులు దువ్వా శేషాబాబ్జి ఆవిష్కరించారు. నగరంలోని కచేరిపేట ప్రాంతంలో ఉన్న లక్ష్మిదాస్ భవన్‌లో ఆదివారం ఈ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. సామాజిక ఉద్యమకారుల చిత్రపటాలతో, ప్రజలకు సామాజిక స్పృహను అందించేలా సిఐటియు క్యాలెండర్‌ను అందించడం జరిగిందని, అందుకు సహకరించిన ప్రకటనకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, కోశాధికారి మలకా రమణ, జిల్లా సహాయ కార్యదర్శి చంద్రమళ్ల పద్మ, వర్కింగ్ కమిటీ సభ్యులు మెడిశెట్టి వెంకటరమణ, నర్ల ఈశ్వరి, చెక్కల వేణి, ఆఫీస్ కార్యాదర్శి రాణి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పి.మల్లవరం పెదపేట గ్రామంలో ముమ్మిడివరం ఎంఎంసి చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న మెగా వాలీబాల్ పోటీలు ఆదివారం తో ముగిశాయి. ఈ పోటీల్లో బొడ్డు వెంకటయ్య పాలెం జట్టు విన్నర్‌గా నిలవగా, భైరవపాలెం జట్టు రన్నర్‌గా నిలిచింది. గిరియంపేట, పెద వలసల జట్లు మూడు, నాలుగు స్థానాల్లో నిలిచాయి. విన్నర్ జట్టుకు చింతలపాటి శ్రీనివాసరాజు రూ:15 వేలు, రన్నర్ జట్టుకు ఆనాల భాస్కర్ రూ.8 వేలు, మూడో స్థానంలో నిలిచిన జట్టుకు మట్టపర్తి లోవరాజు రూ.5 వేలు, నాలుగో స్థానంలో నిలిచిన జట్టుకు పెంకె అర్జున్ రూ.3 వేల నగదు బహుమతులను అందించారు. ముగింపు వేడుకలో ఎంపిపి రాయుడు సునీత, ఎఎంసి ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌ఎఫ్ ఎస్‌ఐ. పెచ్చెట్టి కొండ, ఐ.పోలవరం సొసైటీ అధ్యక్షులు విత్తనాల శ్రీనివాసరావు, ఎంపిటిసి సభ్యులు దున్న రాంబాబు, మాజీ సర్పంచ్ బర్రె బుజ్జిబాబు, విళ్లవీరా, కుడుపూడి శ్రీనివాస్, దడాల వెంకటరమణ, సువర్ణలత పాల్గొన్నారు.



విజేతలతో ఎంపిపి సునీత, ఎఎంసి ఛైర్మన్ శివన్నారాయణ



బోజనాలు వడ్డిస్తున్న జ్యోతుల నవీన్

అన్ని దానాల్లోనూ అన్నదానం గొప్పది

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

అన్ని దానాల్లోనూ అన్నదానం గొప్పదని, పేదవారి కోసమే అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసి పేదల ఆకలి తీరుస్తామని కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ అన్నారు. స్థానిక ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద ప్రతి సోమవారం రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ ఈ వారం సంక్రాంతి పండుగ అవ్వడంతో ఆదివారం నిర్వహించారు. ఈ క్యాంటీన్‌ను జ్యోతుల నవీన్ ప్రారంభించి భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల పార్టీ టిడిపి అని, మళ్ళీ టిడిపి, జనసేన సంకీర్ణ ప్రభుత్వం 2024లో అధికారంలోకి వస్తుందన్నారు. 2024 లో ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు మరలా అన్నా క్యాంటీన్లను పునరుద్ధరిస్తారని అన్నారు. నేటి వైసిపి పాలనలో రాష్ట్రంలో పెరిగిన నిత్యావసరధరలతో పేదల, సామాన్యుల బతుకులు చిన్నాభిన్నమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, అడబాల వెంకటేశ్వరరావు, కొత్త కొండబాబు, పాండ్రంగి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆకలి కేకలతో రగిలిన భోగి మంటలు

- భోగి మంటల్లో ఎస్మా ప్రతుల దహనం
- జీతాలు పెంచేదాకా సమ్మె విరమించేది లేదు
- రాష్ట్ర అధ్యక్షురాలు బేబిరాణి వెల్లడి

ప్రజాశక్తి - యంత్రాంగం

రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీలు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం నాటికి 34వ రోజుకు చేరింది. కుటుంబ సభ్యుల మధ్య జరుపుకోవాల్సిన క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలతోపాటు, ఆదివారం జరిగిన భోగి పండుగను నడి రోడ్డుపైనే వారు జరుపుకోవాల్సివచ్చింది. ఇందుకు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అంగన్‌వాడీల ఉద్యమం పట్ల అవలంభించిన నిరంకుశ విధానాలే కారణంగా నిలుస్తున్నాయి. ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా అంగన్‌వాడీలు రెట్టించిన ఉద్యమ స్ఫూర్తితో ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. అంగన్‌వాడీలపై జగన్ సర్కార్ విధించిన ఎస్మా చట్టం ప్రయోగాన్ని నిరసిస్తూ ఎస్మా ప్రతులను తమ ఆకలికేకలతో రగిలిన భోగి మంటల్లో దహనం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. **కాకినాడ** స్థానిక సమ్మె శిబిరం వద్ద అంగన్‌వాడీలు ఎస్మా చట్టం ప్రతులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. సమ్మె డిమాండ్లు ప్రతిబింబించేలా సంక్రాంతి ముగ్గులు వేసి చూపరులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబీరాణి మాట్లాడుతూ తమ కుటుంబ సభ్యుల మధ్య చేసుకోవాల్సిన భోగి మంటలను నిరసన శిబిరంలో చేసుకోవాల్సిన దుస్థితికి వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిందని ధ్వజమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా లక్ష మందికిపైగా అంగన్‌వాడీలు తమ ఆకలి కేకలతో భోగి పండుగను నడి రోడ్డుపై జరుపుకోవాల్సివచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ప్రభుత్వంతో ఆరు దఫాలు చర్చలు జరిగిన సందర్భంగా రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ ఒకసారి మాత్రమే చర్చల్లో పాల్గొన్నారని, రాష్ట్రవ్యాప్తంగా లక్ష మంది అంగన్‌వాడీలు పెరిగిన ధరలు కనుగుణంగా వేతనాలు పెంచమని 34 రోజులుగా సమ్మె చేస్తుంటే జగన్ ప్రభుత్వం మేకపోతు గంభీర్యాన్ని ప్రదర్శిస్తూ సమస్యను పరిష్కరించకుండా సాగదీస్తుందని విమర్శించారు. వేతనాలు పెంచేదాకా సమ్మెను విరమించే ప్రసక్తే లేదని ఆమె తేల్చిచెప్పారు. అంగన్‌వాడీల సమ్మెకు మద్దతుగా రాష్ట్రంలో ఉన్న మేధావివర్గం కూడా కదులుతుందని తెలిపారు. ఇప్పటి వరకు ప్రభుత్వంతో జరిగిన చర్చల సారాంశాన్ని సభ్యులకు వివరించారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రవర్తి మాట్లాడుతూ అంగన్‌వాడీలు చాలా పట్టుదలతో చేస్తున్న సమ్మె అనేక ఉద్యోగ, కార్మిక సంఘాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని, యుటిఎఫ్ తరపున మీరు చేసేటువంటి పోరాటంలో పండగ సెలవుల అనంతరం రిలే దీక్షలో మేము కూడా పాల్గొంటామని తెలిపారు. జగన్ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు రూ.18 వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని, ఉద్యోగుల, కార్మికుల సమస్యలు పరిష్కారంచడంలో జగన్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఇదే పట్టుదలతో వేతనాలు పెంచుకునేంతవరకు సమ్మెను కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమ్మె శిబిరంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వా శేషాబాబ్జి, చెక్కల రాజ్ కుమార్, జిల్లా కోశాధికారి మలకా రమణ, ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు నర్ల ఈశ్వరి, చంద్రమళ్ల పద్మ, సిఐటియు సీనియర్ నాయకులు మేడిశెట్టి వెంకటరమణ, కాకినాడ అర్బన్, రూరల్ అంగన్‌వాడీ యూనియన్ నాయకులు రమా, వీరవేణి, మున్నీ, చామంతి, విజయ, శ్రీదేవి, అర్బన్, రూరల్ అంగన్‌వాడీలు ఉన్నారు. **పెద్దాపురం** స్థానిక మున్సిపల్ సెంటర్‌లో నిర్వహిస్తున్న సమ్మె శిబిరం వద్ద నుంచి మిరపకాయల వీధిలోని రామాలయం వరకు అంగన్‌వాడీలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీల సమ్మెను నిషేధిస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఎస్మా చట్టం జీవో నెంబర్ 2 ప్రతులను, అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన షోకాజ్ నోటీసుల ప్రతులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు దాడి బేబీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం పండుగ పూట రోడ్డున పడేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఇంటి నుంచి సంతకాలు సేకరించి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి కోటి సంతకాలతో వినతిపత్రం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు డి.క్రాంతి కుమార్, నీలపాల సూరిబాబు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు నాగమణి, అమల, ఎస్తేరు రాణి, బాలం లక్ష్మి, టివిఎల్.పద్మావతి, లోవతల్లి, వరలక్ష్మి, వెంకటలక్ష్మి, భవాని, పద్మ, దేవి, తులసి తదితరులు పాల్గొన్నారు. **జగ్గంపేట రూరల్** స్థానిక పంచాయతీ అతిథి గృహం వద్ద ఏర్పాటు చేసిన సమ్మె శిబిరం వద్ద భోగి సందర్భంగా హరిదాసుతో సంకీర్తనలు పాడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం పెంచాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని, తదితర డిమాండ్లను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు సుజాత, రాజేశ్వరి, రామ్ లీలా, అనంతలక్ష్మి, గంగాభవాని, తదితరులు పాల్గొన్నారు. **తాళ్లరేవు** స్థానిక తహాశీల్దార్ కార్యాలయం వద్ద జరుగుతున్న నిరసన శిబిరం వద్ద భోగిమంటలు వేసి అంగన్‌వాడీలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భోగి మంట చుట్టూ కోలాటం చేశారు. **కరప** స్థానికంగా జరుగుతున్న నిరసన శిబిరం వద్ద అంగన్‌వాడీలు భోగి మంటల్లో ఎస్మా చట్టం ప్రయోగిస్తూ జగన్ సర్కార్ విడుదల చేసిన జిఒ నెంబర్ 2 ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకురాలు పి.వీరవేణి మాట్లాడుతూ అంగన్‌వాడీల పట్ల సిఎం జగన్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో భవాని, బి.అచ్చరత్నం, ఆర్.దైవ కుమారి, ఎస్.వరలక్ష్మి, జిఎకెఎల్. నారాయణమ్మ, సాయి, జ్యోతి పాల్గొన్నారు. **కిర్లంపూడి** స్థానిక అంగన్‌వాడీల నిరసన శిబిరం వద్ద ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ భోగి మంటల్లో ఎస్మా ప్రయోగిస్తూ తీసుకొచ్చిన జిఒ నెంబర్ 2 ప్రతులను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో జి.రత్నం, పి. మంగాయమ్మ, పి.ప్రభావతి, హసీనా బేగం తదితరులు పాల్గొన్నారు.



పెద్దాపురంలో భోగి మంటల జిఒ నెంబర్ 2 ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు



కరపలో భోగి మంటల జిఒ నెంబర్ 2 ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు



జగ్గంపేటలో నిరసన శిబిరంలో హరదాసుతో కీర్తనలు ఆలపించిన అంగన్‌వాడీలు

కార్టూ'నిజం'



వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపండి

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

చీకటి జిఒలతో రాష్ట్ర ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపాలని ఎంఎల్‌ఎ, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు నిమ్మకాయల చినరాజప్ప పిలుపునిచ్చారు. స్థానిక అచ్చంపేట వద్ద గల ఆయన క్యాంపు కార్యాలయం వద్ద ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చీకటి జిఒ నెంబర్ 1 ప్రతులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా చినరాజప్ప మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం గత నాలుగున్నర సంవత్సరాలుగా అనేక చీకటి జిఒలను తీసుకొచ్చి లక్షల కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడిందని, అన్ని వర్గాల ప్రజలపై భారాల మోపి ఇబ్బందులకు గురి చేసిందని, ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ తనయుడు నిమ్మకాయల రంగనాగ్, పనసపాడు గ్రామ సర్పంచ్ చీకట్ల వెంకటేష్, మాజీ ఎంపిటిసి వింటి సుబ్బరాయన్, తదితరులు పాల్గొన్నారు. అలాగే సామర్లకోట మటన్ సెంటర్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్ష కార్యదర్శులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఈ ప్రభుత్వం పోవాలని సైకిల్ ప్రభుత్వం రావాలని కోరుతూ భోగిమంటల్లో చీకటి జిఒలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు యార్లగడ్డ చిన్ని, కంటే బాబు, గొల్తి సత్యనారాయణ, కౌన్సిలర్ బలుసు వాసు పాల్గొన్నారు.



చీకటి జిఒ నెంబర్ 1 ప్రతులను భోగి మంటల్లో దహనం చేస్తున్న చినరాజప్ప

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

మండలంలోని వేట్లపాలెం జడ్‌పి ఉన్నత పాఠశాలలో 1991 -92 10వ తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం వేట్లపాలెం రామకృష్ణ సేవాసమితి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. నాటి గురువులను సత్కరించి గత జ్ఞాపకాలను ఒకరికొకరు నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యను అందించిన గురువులను ఘనంగా సత్కరించి అభిమానం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో అప్పటి హెచ్‌ఎం యాముదాల చక్రపాణి, ఉపాధ్యాయులు మల్లాది వీరవెంకట సుబ్రహ్మణ్య శర్మ, పివెంకట్రావు, అచ్యుతరామయ్య, వల్లూరి బద్రీనారాయణ, పుట్టా సత్యన్నారాయణ, విప్పెర్ల సత్యన్నారాయణ, మోరంపూడి వెంకటేశ్వరరావు, వల్లూరి వీరభద్రరావు, పాలచర్ల వీరవెంకట సత్యన్నారాయణ, పూర్వ విద్యార్థులు కంటిపూడి గోపాలకృష్ణ, సానిపిని సాయిప్రసాద్, నక్కా వెంకట రమణ పాల్గొన్నారు.

ఉత్కంఠగా సాగుతున్న క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి - కరప

గత 30 సంవత్సరాలుగా సంక్రాంతి సందర్భంగా నిర్వహిస్తున్న క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ కరప (సిఎకె) క్రికెట్ టోర్నమెంట్ ఉత్కంఠగా సాగు తోంది. స్థానిక నక్కా సూర్యనారాయణ మూర్తి జడ్‌పి ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం జరిగిన 3వరోజు క్రికెట్ పోటీలను జిల్లా క్రికెట్ అసోసియే షన్ మాజీ ఉపాధ్యక్షుడు, సిఎకె అధ్యక్షుడు దేవు మధువిరేష్ ఆధ్వర్యంలో వైస్ ఎంపిపి పాట్నీడి సత్య భీమేశ్వరరావు (భీమన్న) టాస్ వేసి ప్రారంభించారు. రెడ్డిపల్లి రమేష్ క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలి పారు. ఈ సందర్భంగా క్రికెట్ మ్యాచ్ నిర్వాహకులు దేవు మధువీరేష్ మాట్లాడు తూ ఈనెల 12వ తేదీన ప్రారంభమైన ఈ పోటీల్లో 18 టీమ్‌లు పాల్గొనగా ప్రస్తుతానికి కరప, గురజానాపల్లి జట్లు లీగ్‌లో తలపడేందుకు అర్హత సాధించా యన్నారు. ఈ లీగ్ పోటీలు 13, 14, 15, 16 తేదీల్లో జరుగుతున్నాయని తెలిపారు. వీటిని జయప్రదం చేయాలని కోరారు. తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ యువతను చెడు మార్గాలకు వెళ్ళకుండా వారి దృష్టిని మరల్చేందుకు దేవు మధు విరేష్ ఈ క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నక్కా భీమ్, గోన శివ, దేవు శివ, సీఏకే ఫ్రెండ్స్ లెవెన్ సభ్యులు పాల్గొన్నారు.



క్రీడాకారులున పరిచయం చేసుకుంటున్న వైస్ ఎంపిపి భీమన్న

సంప్రదాయ కొలువు..కోనసీమ ప్రభ

- ఎపిలో అతిపెద్దవైన వాకలగరువు, తొండవరం ప్రభలు
- నాలుగు దశాబ్దాల చరిత్ర కలిగిన జగ్గన్నతోట ప్రభల తీర్థం



అప్పర్ కౌశిక దాటుతున్న గంగలకుర్రు అగ్రహారం ప్రభ

ప్రజాశక్తి - అంబాజీపేట

కోనసీమలో సంస్కృతి, సంప్రదాయాల కొలువు కోనసీమలో పైరు పచ్చని తివాచీలాంటి వరిచేలు స్వాగతించే కొబ్బరి చెట్ల నడుమ నేలకు దిగొచ్చిన ఇంద్రధనస్సులా ప్రభల తీర్థాలు సాగుతాయి. సంక్రాంతి ప్రభల తీర్థాలకు కోన సీమ ముఖ్య వేదిక అయినప్పటికీ అంబాజీపేట మండలంలో జగ్గన్నతోట, వాకలగరువులో జరిగే ప్రభల తీర్థాలు రాష్ట్ర, జిల్లాల వ్యాప్తంగా ప్రాముఖ్యత సంతరించుకున్నాయి.

జగ్గన్నతోట ప్రభల తీర్థం

అంబాజీపేటలో మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో జరిగే ప్రభల తీర్థానికి 400 ఏళ్ల చరిత్ర ఉంది. కోనసీమలో జరిగే ప్రభల ఉత్సవాలలో అతి పెద్దది ఇది. ఒక్కడ ఏకాదశ రుద్రులు లోక కళ్యాణార్థం కొలువు తీరుతాయని ఈ ప్రాంత ప్రజల విశ్వాసం స్థానికంగా ఉన్న భోగేశ్వర స్వామి ఆలయంలోని రాగి శాసనాన్ని బట్టి చరిత్రాత్మక ప్రాముఖ్యత ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతంలో ఎలాంటి గుడి, గోపురము లేకుండా ఏడు ఎకరాల కొబ్బరితోటలో తీర్థం నిర్వహిస్తారు.ఈ ప్రాంతాన్ని జగ్గన్నతోటగా పిలుస్తారని చరిత్ర ఆధారాలని బట్టి తెలుస్తోంది.

సుందరం.. ఆహ్లాదకరం

మొసలపల్లిలో భోగేశ్వరస్వామి పిలుపు మేరకు గంగలకుర్రు అగ్రహారంలో వీరేశ్వరస్వామి, గంగలకుర్రులో చెన్నమల్లేశ్వర స్వామి ప్రభలు వరి చేల నుంచి అప్పర్ కౌశిక్ ను దాటుకుంటూ వచ్చే సుందర దృశ్యాలను చూసేందుకే రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా పోటీ పడుతుంటారు. అప్పటికే నారుమడులు, నాట్లు వేసిన పంటచేలను తొక్కుకుంటూ ప్రభలను తీసుకొచ్చే దశ్యం మేనకేశ్వర జగ్గన్నతోట అప్పర్ కౌశిక్ దాటుతున్న ప్రభల ఆహ్లాదకరమైన. మేనకేశ్వర స్వామి(కె.పెదపూడి), వ్యాఘేశ్వర స్వామి (వ్యాఘేశ్వరం), ఆనంద రామేశ్వరస్వామి(ఇరుసుమండ), కాశీ విశ్వేశ్వరస్వామి (వక్కలంక), చెన్న మల్లేశ్వరస్వామి(నేదునూరు), రాఘవేశ్వరస్వామి (ముక్కామల), మల్లేశ్వరస్వామి (పాలగుమ్మి), అభినవ వ్యాఘేశ్వర స్వామి (పుల్లేటికుర్రు) గ్రామాల నుంచి ఇలా 11 ప్రభలు కొలువుతీరే తీర్థాన్ని చూసేందుకు తరలి వస్తారు. అన్ని ప్రభల కంటే ముందుగా మొసలపల్లి ప్రభ కొలువుదీరి ఆహ్వానం పలుకుతోంది. సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేసే ప్రభలలో వాకలగరువు, తొండవరం ప్రభలు గుర్తింపు పొందాయి. వాకలగరువు రావిచెట్టు సెంటర్‌లో వాకలగరువు 53 అడుగులు, తొండవరం 51, గున్నేపల్లి 32 అడుగుల ఎత్తు ప్రభలు ఉంటాయి.

గత ఏడాది గణతంత్ర వేడుకల్లో

దేశ రాజధాని ఢిల్లీ లో గత ఏడాది గణతంత్ర దినోత్సవ వేడుకల పరేడ్‌కు డాక్టర్ బిఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా జగ్గన్నతోట ఏకాదశ రుద్రుల ప్రభల శకటం రాష్ట్రపతి చే ప్రశంసలు అందుకుంది. ఈ ప్రభల తీర్థం తిలకించేందుకు సుదూర ప్రాంతాల్లో ఉన్న ఈ ప్రాంత వాసులు సంక్రాంతి సందర్భంగా స్వగ్రామాలకు చేరుకుని ఆత్మీయ సహచరు లతో సమావేశాలు నిర్వహించుకోవడం జరుగుతుంది.

ఆత్మీయత అనురాగాలు ప్రతిబింబిస్తాయి

క్షణం తీరిక లేకుండా బిజీబిజీ జీవితం గడిపే పట్టణ వాసులకు సంక్రాంతి పండగ ఆత్మీయత అనురాగాలు మెరుగుపరుచుకోవడానికి దోహదపడుతుంది.



ఎత్తయిన వాకలగరువు ప్రభ

సంక్రాంతి సంబరాల్లో..

సంక్రాంతి సంబరాలలో కెండు ఎద్దుల బళ్ళ, ప్రభలు తీర్థాలు, గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలు ఆకర్షణగా నిలుస్తాయి. ప్రభల తీర్థాలు ఆనాటి పల్లె జీవనాన్ని గుర్తుచేస్తాయి.

ప్రభల తీర్థాలకు పటిష్టమైన బందోబస్తు



మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో, వాకలగరువుల్లో జరిగే ప్రభల తీర్థాలకు కొత్తపేట డిఎస్‌పి పర్యవేక్షణలో, పి.గన్నవరం సిఐ ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశాం.తీర్థాలలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలకు పాల్పడకుండా ప్రశాంతంగా ప్రబల ఉత్సవాలు జరుపుకోవాలి.

-ఎ.చైతన్య కుమార్ , ఎస్ఐ, అంబాజీపేట

నేడు ట్రాఫిక్ మళ్లింపు

ప్రజాశక్తి-కొత్తపేట

కొత్తపేటలో నిర్వహించే ప్రభల తీర్థం సందర్భంగా ఈ క్రింది విధంగా ట్రాఫిక్ మళ్లించడమైందని డిఎస్‌పి వెంకటరమణ ఆదివారం ప్రకటనలో తెలిపారు రావులపాలెం మీదుగా వచ్చే వాహనాలు బోడిపాలెం వంతెన నుంచి వాడపాలెం మీదుగా అయినవిల్లి వైపు, అమలాపురం వైపు నుంచి రావులపాలెం వైపు వెళ్లే వాహనాలు పలివెల వంతెన నుంచి గంటి మీదుగా రావులపాలెం వైపు మళ్లించడమైందన్నారు. వాడపాలెం దేవి సెంటర్ నుంచి కొత్తపేట వైపు వాహనాలు నిషేధించడమెందన్నారు. ఎటువంటి వాహనాములు కొత్తపేట ఊర్లోకి అనుమతి లేదు.మంగళవారం నుంచి యథావిధిగా రాకపోకలు జరుగుతాయని ఈవిషయం కొత్తపేట పరిసర ప్రాంత ప్రజలందరికీ తెలియజేయడమెందన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-ఆలమూరు



పంపిణీ చేస్తున్న పాపారావు

మండల కేంద్రానికి చెందిన పారిశ్రామిక వేత్త, దాత వంటిపల్లి పాపారావు ఆదివారం సంక్రాంతి వేడుకలలో భాగంగా భోగి సందర్భంగా పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సంపాదనలో కొంత మేర ఆపన్నుల అవసరాలు తీరుస్తూ తో సంతృప్తి పొందుతున్నానన్నారు. నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



బాలబాలాజీ అన్న దాన ట్రస్ట్ విరాళం ఇచ్చిన దాతకు చిత్ర పటం అందిసున్న చైర్మన్

ప్రజాశక్తి-మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ శాశ్వత నిత్యాన్నదానట్రస్ట్‌కు ఆదివారం దాతలు విరాళాలు అందజేశారు. రాజమహేంద్రవరం వాసులు జొన్నలగడ్డ వెంకట రామదాసు ఇందుమతిల జాపకార్థం ప్రతీ ఏటా ముక్కోటి ఏ కాదశి రోజున అన్నదానం జరిపించేందుకు వారి కుమారుడు సోమశేఖర్, నాగమణి దంపతులు ఆదివారం అన్న దానట్రస్ట్ కు రూ.1,00,116) విరాళం గా ఇచ్చారని ఆలయ సహాయ కమిషనర్ గ్రంది మాధవి తెలిపారు. దాతలకు ఆలయ ఛైర్మన్ చిట్టూరి రామకష్ణ స్వామి వారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

గోదాదేవి కల్యాణం

బాల బాలాజీస్వామి సన్నిధి లో ఆదివారం సంక్రాంతిని పురస్కరించుకొని భోగి మంటలతో, హరిదాసు, ముగ్గులు, ఎడ్ల బండి తో, చెరుకులతో అలంకరణ చేసి పొంగలితో సాంప్రదాయంగా. సాంస్కతిక కార్యక్రమములు, ఏర్పాటుచేశారు. తదుపరి గోదాదేవి రంగనాథస్వామి కల్యాణం యాత్రికులచే కార్యక్రమములోఆలయ ఛైర్మన్ చిట్టూరి రామకష్ణ మరియు.. ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మరియు కార్య నిర్వహణ అధికారిణి గ్రంధి మాధవి పాలుగున్నారు.

ఫోటో. అన్న దాన ట్రస్ట్ విరాళం దాతకు చిత్ర పటం అందిసున్న చైర్మన్

నేడు ' స్పందన' కార్యక్రమం రద్దు

ప్రజాశక్తి-అమలాపురం

ఈ నెల 15న మకర సంక్రాంతి పండగ సెలవు దినం సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించే జగనన్నకు చెబుదాం ప్రజా ఫిర్యాదుల పరి ష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం లేదని జిల్లా కలెక్టర్ కార్యా లయ సిబ్బంది ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని వారు ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - కాట్రేనికోన

మండల పరిధిలోని పల్లంకుర్రు లో పేకాటలు జరుగుతున్నాయన్న సమాచారం మేరకు ట్రైనీ డిఎస్‌పి ఆధ్వర్యంలో కాట్రేనికోన పోలీసులు శనివారం రాత్రి దాడి చేశారు. 22మంది పేకాట ఆడుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారివద్దనుండి రూ. 1,42,810 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగేశ్వరావు తెలిపారు

1100 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - రౌతులపూడి

మండల కేంద్రమైన రౌతులపూడి ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ పి.సునీల్‌కుమార్ పర్యవేక్షణలో ఆదివారం రౌతులపూడిలో చేసిన దాడుల్లో 1100 లీటర్లు నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. నాటు సారాను ఐదుగురు వ్యక్తులు నిల్వ చేసి ఉంచినట్లు వచ్చిన సమాచారంతో దాడి చేసి సారాను స్వాధీనం చేసుకోవడంతోపాటు, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ దాడిల్లో ఎస్ఐ అబ్దుల్ నబి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా భోగి వేడుక

ప్రజాశక్తి - యానాం



భోగి వేడుకల్లో రామన్న కోడు గ్రామస్తులు

యానాం పరిధిలోని పలు గ్రామాల్లో భోగి పండుగ వేడుక ఘనంగా జరిగాయి. ప్రతి వీధిలోను భోగి మంటల వద్ద పిల్లల కేరింతలతో మంటల్లో పిడకల దండలు వేస్తూ ఆనందాన్ని పొందారు. స్థానిక రామన్నకోడు గ్రామంలో ధనుర్మాసాన్ని పురస్క రించుకుని నెల రోజులపాటు తెల్లవారు జామున భజనలను చేసిన నిర్వాహకులు ఆదివారం ముగింపు సందర్భంగా వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద ప్రత్యేక భజనలు చేశారు.

100 మంది మహిళలకు చీరల పంపిణీ

ప్రజాశక్తి - కరప

కాకినాడకు చెందిన సానా సతీష్ బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 100 మందికి చీరలు పంపిణీ చేశారు. భోగి పండుగను పురస్కరించుకుని స్థానిక మెరక వీధి రామాలయం వద్ద ఆదివారం కరప గ్రామానికి చెందిన నిరుపేదలకు మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, నక్కా భద్రం చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నక్కా సత్యనారాయణ, నక్కా శ్రీను బాబు, పాట్నీడి సూరిబాబు పాల్గొన్నారు.

ఘనంగా ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

డివైఎఫ్ఐ, సిఐటియు, ఐద్వా, ప్రజానాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వరహాలయ్య పేట, సత్తెమ్మ కాలనీ, నువ్వుల గుంట వీధి, సుందరయ్య కాలనీలలో ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళలు, బాలికలు ఉత్సాహంగా పాల్గొని ముగ్గులలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ పోటీలను కరక సుబ్బలక్ష్మి, గాడి సత్యవతి, రొంగల సుబ్బలక్ష్మి, నమ్రత, అమృత, పూజిత, వరలక్ష్మి, క్రాంతి కుమార్ తదితరులు పర్యవేక్షించారు.

వైభవంగా గోదా దేవి రంగనాథ కల్యాణం

ప్రజాశక్తి - కాజులూరు

గోధా రంగనాధుల కళ్యాణ మహోత్సవం మండలంలోని కోలంక గ్రామంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. కేశవ స్వామీ ఆలయ ప్రాంగణంలో ఆలయ అర్చకులు వింజరపు సత్యనారాయణాచార్యులు, సుదర్శనం పవన్ కుమార్ అధ్వర్యంలో వరదా సోమేశ్వర వరుణ్ హన్సిక దంపతులచే నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వరదా శేషారావు మాట్లాడుతూ లోక కళ్యాణర్థం గ్రామ సౌభాగ్యం కొరకు ప్రతీ సంవత్సరం భోగి పండగ రోజున ఈ మహోత్సవం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కోటికలపూడి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక రచనలతో విజ్ఞాన సమాజం

ప్రజాశక్తి - కాజులూరు

వైజ్ఞానిక వాస్తవికత రచనలతో విజ్ఞాన సమాజం ఏర్పడుతుందని ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ యనమదల మురళీకృష్ణ అన్నారు. మండలంలోని పల్లిపాలెంలో ఆదివారం జరిగిన మధునాపంతుల సూరయ్య శాస్త్రి శతజయంతి ఉత్సవాలలోఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మురళీకృష్ణకు, విజయ వాడకు చెందిన ఆయుర్వేద వైద్యులు రచయిత డాక్టర్ జీవి పూర్ణచంద్‌కు 'ప్రతిభా పురస్కారం' అందజేశారు. దాట్ల దేవదానం రాజు, కిరణ్ మధునాపంతుల, పిఆర్ఎల్ స్వామి, రవిశంకర్ రెడ్డి, గోవిందరెడ్డి తదిత రులకు ఆత్మీయ సత్కారం చేశారు. మధునా పంతుల సత్యనారాయణ మూర్తి అధ్యక్షతన జరి గిన సభలో డాక్టర్ మురళీ కృష్ణ మాట్లాడుతూ, సాహిత్యంలో రెండు పాయ ల్లో ఒకటైన భావుక - కాల్పనిక సాహిత్యంలో వచ్చినంత ఎక్కువగా వైజ్ఞానిక - వాస్తవిక సాహిత్యంలో రచనలు రాకపోవడం పెద్ద లోటు అని అన్నారు. చరిత్ర, సైన్సు, టెక్నాలజీ, మెడికల్ రంగాలలో రచనలు ప్రజల జీవితాలను గుణాత్మకంగా మారుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటాచలపతి, మధునా మూర్తి ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గాయాలతో గుర్తు తెలీని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ఆలమూరు



ప్రమాదవశాత్తూ రోడ్డు ప్రమాదంలో గాయాల పాలైన మతిస్థిమితం లేని, గుర్తు తెలియని వ్యక్తి ఆసుపత్రిలో చికిత్సపొందుతూ పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ ఎల్.శ్రీను నాయక్ మాట్లాడుతూ 216ఎ జాతీయ రహదారిపై చెముడులంక వద్ద ఈ నెల 5న ఒక మతి స్థిమితం లేని వ్యక్తి డివైడర్ దాటుతూ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఈ ఘటనలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి ఆంబులెన్స్‌లో తరలించారు. నాటి నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆ వ్యక్తి యొక్క పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందినట్లు తెలిపారు. ఆ వ్యక్తి ఆచూకీ తెలిసినవారు సెల్ నెం.94409 04849కు ఫోన్ చేసి వివరాలు తెలియజేయాలని ఆయన కోరారు.